ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
మంగళవారం
16 సెప్టెంబర్ 2025

16వేల మంది విదేశీయులను దేశం నుంచి బహిష్కరించనున్న కేంద్రం

సెప్టెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): దేశం నుంచి 16వేల మంది విదేశీయులను బహిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్లో ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త వలస చట్టాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నార్కోటిక్స్ రవాణా, ఇతర నేరాలతో సంబంధమున్న దాదాపు 16,000 మంది విదేశీయులను దేశంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అదుపులోకి తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం నిర్బంధ కేంద్రాల్లో ఉన్నవారందరినీ దేశం నుంచి బహిష్కరించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పలు జాతీయ మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. ఫోర్జరీ పత్రాలతో దేశంలో అక్రమంగా నివాసముంటున్న విదేశీయులకు కఠిన శిక్షలు విధించే కొత్త చట్టం సెప్టెంబర్ 2న అమల్లోకి వచ్చింది. వలసలు, విదేశీయుల చట్టం-2025గా వ్యవహరిస్తున్న దీనిని బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఆమోదించగా.. ఏప్రిల్ 4న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. నాలుగు పాత చట్టాల స్థానంలో ఇది అమల్లోకి వచ్చింది. ఇందులోభాగంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దేశంలోకి ప్రవేశించిన విదేశీయులకు కనిష్టంగా రెండేళ్లు, గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష.. రూ. లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా.. భారత్లో పేదరికంలో మగ్గుతున్నవారు కోట్లాది మంది ఉన్నారు. పేదరికాన్ని అంతం చేయడానికి ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. అయితే ఈ సమస్య పరిష్కారంలో అక్రమ వలసలు ప్రధాన అడ్డుగోడగా నిలుస్తున్నాయి. సరిహద్దు దేశాల నుంచి అక్రమంగా ప్రవేశించిన విదేశీయులు చట్టవిరుద్ధంగా ఉండడమే కాకుండా అసలైన లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమఫలాలను వీరు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం అమల్లోకి తీసుకువచ్చిన వలసలు, విదేశీయుల చట్టం ద్వారా వారిని దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటోంది.

సీఎం గారూ.. నన్ను మళ్లీ నడిపించారు..థాంక్యూ!

హైదరాబాద్, సెప్టెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): హనుమకొండ జిల్లా దామెర మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్రెడ్డిని కలిశారు.



ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన తనకు ప్రోత్సాహకం అందించి మళ్లీ నడిచేలా చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 2, 2024న రైలులో రాజస్థాన్ వెళ్తున్న రాహుల్ను కొందరు దుండగులు రైలు నుంచి కిందికి తోసేశారు. ఈ ఘటనలో రెండు కాళ్లు కోల్పోయిన రాహుల్కు సీఎం సహాయనిధి ద్వారా చికిత్స అందించి, కృత్రిమ కాళ్లు అమర్చేందుకు ప్రభుత్వం సాయం చేసింది. అందుకు కృతజ్ఞతగా రాహుల్ తన కుటుంబంతో కలిసి వచ్చి మర్యాద పూర్వకంగా సీఎంను కలిశారు.

2 నెలల్లో 100% ఫైళ్లు అన్‌లైన్‌లో ఉండాలి: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): డేటా లీక్, ఆర్టీజీఎస్ లెన్స్, అవేర్ 2.0 అంశాలపై కలెక్టర్ల సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఎన్నిసార్లు చెబుతున్నా రెవెన్యూ శాఖ సంతృప్త స్థాయిలో సేవలు అందించట్లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

కలెక్టర్లు చూసే దస్త్రాల క్వాలిటీ ఎంత ఉందో కూడా తనిఖీ చేస్తామన్నారు. రెండు నెలల్లో వంద శాతం ఫైళ్లు ఆన్లైన్లో ఉండాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేశారు. మానిపులేషన్ లేకుండా ఫోరెన్సిక్ ఆడిటింగ్ లాంటివి కూడా తెస్తామన్నారు. నెక్స్ట్ జెన్ టెక్నాలజీ వైపు మనం ముందడుగు వేయాలని ఈ సందర్భంగా కలెక్టర్లకు చంద్రబాబు సూచించారు. ఆర్టీజీ జిల్లా కేంద్రాలు అక్టోబర్ చివరి నాటికి సిద్ధమవుతాయని చెప్పారు.

ఆ బాధిత కుటుంబాల గుండెకోత కనిపించడం లేదా?: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన కొనసాగుతోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

హైదరాబాద్లో నాలాలో పడి కొట్టుకుపోయిన ముగ్గురి మృతదేహాలను మూడు రోజులు గడుస్తున్నా వెలికితీయకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎస్ఎల్బీసీ టన్నెల్ కుప్పకూలిన ఘటనలో ఆరుగురి మృతదేహాలను ఇప్పటికీ గుర్తించలేని అసమర్థత కాంగ్రెస్దేనన్నారు. కనీసం తమ ఆప్తులను చివరి చూపు కూడా చూసుకోలేని ఆ బాధిత కుటుంబాల ఆవేదన, గుండెకోత మానవత్వం లేని కాంగ్రెస్కు వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. నాలాల్లో బలి చేసిన ముగ్గురి మృతదేహాలను కూడా గుర్తించకపోతే భారత రాష్ట్ర సమితి చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

సింగపూర్‌లో సెంటోసా ఐలాండ్ను సందర్శించిన విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా సెంటోసా ఐలాండ్ను ఎంపీ సందర్శించారు. అక్కడి బీచ్లు, మౌలిక సదుపాయాలను పరిశీలించి విశాఖలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్షలాది మంది పర్యాటకులను ఆకర్షించే సెంటోసా అభివృద్ధి ప్రయాణం, అమలు చేసిన వ్యూహాల గురించి మేనేజ్మెంట్ టీమ్ శ్రీభరత్ కి వివరంగా అవగాహన కల్పించింది. స్థిరమైన అభివృద్ధి, ప్రపంచస్థాయి ఉత్తమ పద్ధతులు, అధునాతన సౌకర్యాలతో పర్యాటకులకు మెరుగైన అనుభవం కల్పించే మార్గాలపై దృష్టిపెడుతున్నట్లు ఎంపీ చెప్పారు. టూరిజం, భద్రత నిర్వహణలో ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా పలు అంశాలపై వారితో ఆయన చర్చించారు. విశాఖకు సముద్ర తీరం, సాంస్కృతిక వారసత్వం, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు వేదిక కావడానికి ఉన్న అవకాశాలను శ్రీభరత్ వివరించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

రూ.60 కోట్ల చీటింగ్ కేసు..

రాజ్కుంద్రాను 5 గంటలు ప్రశ్నించిన ముంబయి పోలీసులు

ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పా శెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా రాజ్కుంద్రాను ముంబయి పోలీసులు విచారించారు. 5గంటల పాటు ఆయన్ని విచారించిన పోలీసులు అతని బ్యాంక్ స్టేట్మెంట్ వివరాలు, ఇతర ఖర్చుల గురించి ఆరా తీసినట్లు తెలుస్తోంది. అయితే కొన్ని కంపెనీల్లో రూ.60కోట్లు పెట్టుబడులుగా పెట్టినట్లు విచారణ సమయంలో రాజ్కుంద్రా అంగీకరించినట్లు సమాచారం. ఈ నిధులను నిజంగానే సంబంధిత కంపెనీలకు మళ్లించారా లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించారా అనేదానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనితో పాటు రాజ్కుంద్రా ఇతర వ్యాపారాలపై, ఆయన అద్దెకు తీసుకున్న కార్యాలయాలకు సంబంధించిన చెల్లింపులపై పోలీసులు ఆరాతీస్తున్నారు. ఏక్తాకపూర్ బాలాజీ టెలీఫిల్మ్స్కు రాజ్కుంద్రా చెల్లింపులు చేశారని వాటికి సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని ఆర్థిక నేరాల విభాగం ఆయన్ని కోరింది. ఇదీ చదవండి: నిందితులు ఎక్కడ ఉన్నా పట్టుకుంటాం.. దిశా పటానీ కుటుంబానికి సీఎం హామీ ఇప్పటికే ఈ కేసు విషయంలో శిల్పాశెట్టి దంపతులకు ముంబయి పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఒప్పందానికి సంబంధించి రూ.60 కోట్లు మోసం చేశారని శిల్పాశెట్టి), రాజ్ కుంద్రాలపై దీపక్ కొఠారి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జుహు పోలీసులు ఆగస్టు 14న కేసు నమోదు చేశారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్

ఐసీసీ వద్ద భంగపాటు..

వెనక్కి తగ్గిన పాకిస్థాన్..!

ఆసియాకప్లో భాగంగా ఆదివారం భారత్, పాకిస్థాన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ తర్వాత పాకిస్థాన్ ఆటగాళ్లతో భారత క్రికెటర్లు కరచాలనం చేయలేదు. ఈ నేపథ్యంలో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ నిబంధనల ఉల్లంఘనలకు కారణమయ్యారంటూ ఆరోపిస్తూ, ఆయన్ను తొలగించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), ఆసియా క్రికెట్ సంఘానికి ఫిర్యాదు చేసింది. లేదంటే టోర్నీని బహిష్కరిస్తామని పీసీబీ హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలపడమే తమ ఉద్దేశమని, తమ చర్యను టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సమర్థించుకున్నారు. మ్యాచ్ రిఫరీని తొలగించాలన్న పాకిస్థాన్ డిమాండ్ను తాజాగా సోమవారం ఐసీసీ తిరస్కరించింది. "మ్యాచ్ రిఫరీ ఐసీసీ ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడం పై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసింది. ఆసియాకప్ లో మ్యాచ్ రిఫరీగా ఉన్న పైక్రాఫ్ట్ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశాం" అని పీసీబీ చైర్మన్ మోహిసిన్ నఖ్వీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. 'టాస్ సందర్భంగా భారత కెప్టెన్తో కరచాలనం చేయొద్దని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘాతో రిఫరీ పైక్రాఫ్ట్ చెప్పాడు' అని అంతకుముందు ఓ ప్రకటనలో పీసీబీ పేర్కొంది. మరోవైపు పైక్రాఫ్ట్ ఒత్తిడి వల్లే భారత్, పాక్ కెప్టెన్ల మధ్య టీమ్ షీట్ల మార్పిడి జరగలేదంటూ పాక్ మేనేజర్ నవీద్ అక్రమ్ చీమా.. ఏసీసీకి ఫిర్యాదు చేశాడు. అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేసిన ఫిర్యాదును ఐసీసీ పెద్దగా పట్టించుకోలేదు. మ్యాచ్ రిఫరీపై చర్యలకు అంగీకరించలేదు. పీసీబీ డిమాండ్ను తిరస్కరించింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధికారికంగా మాత్రం ఆసియాకప్ టోర్నీ నుంచి వైదొలుగుతామని ఇంతవరకు ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో ప్రణాళిక ప్రకారమే పాకిస్థాన్ బుధవారం యూఏఈతో జరగనున్న మ్యాచ్లో తలపడనున్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్లో విజయం సాధిస్తేనే పాక్ జట్టు సూపర్ 4కు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 21న ఆ జట్టు టీమ్ ఇండియాతో మరోసారి మ్యాచ్ ఆడే అవకాశం ఉంది.

ఇంటి చిట్కాలు

డిన్నర్‌లో ఇప్పుడు చెప్పే ఫుడ్స్ తింటే కిలోల కొద్దీ బరువు తగ్గుతారు.

పైగా అన్నీ కూడా ఇంట్లోనే చేసేసుకోవచ్చు

బరువు తగ్గడానికి చాలా మంది అనేక రకాల డైట్స్ ఫాలో అవుతారు. అయితే, వీటిలోనూ కొన్ని రకాల ఫుడ్స్ తీసుకుంటే త్వరగా బరువు తగ్గుతారు. ముఖ్యంగా కొన్నిఫుడ్స్ని డిన్నర్లో తీసుకుంటే త్వరగా తగ్గుతారు. అవేంటో తెలుసుకోండి.



ప్రజెంట్ చాలా మంది మెయిన్ గోల్ వెయిట్లాస్. ఎంత త్వరగా బరువు తగ్గితే అంత మంచిదని రకరకాల ప్రయత్నాలు చేస్తారు. ఎక్సర్సైజ్లు, డైట్స్, జిమ్స్ అంటూ రకరకాల ప్లాన్స్ చేస్తుంటారు. ఇందులో భాగంగానే బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు కేలరీలని తగ్గిస్తారు. రాత్రిపూట ఎక్కువగా ఫుడ్ తీసుకోరు. అయితే, మనం వెయిట్లాస్లో రాత్రి డిన్నర్ కూడా కీ రోల్ పోషిస్తుంది. సరైన ఫుడ్ తీసుకుంటే త్వరగా బరువు తగ్గుతారు. అందుకోసమే అసలు డిన్నర్లో ఏం తింటే త్వరగా బరువు తగ్గుతారో తెలుసుకోండి.

రాగి దోశ

రాత్రిపూట చాలా మంది చపాతీలు తింటారు. అయితే, కొన్నిరోజులు దోశలు అది కూడా బియ్యంతో చేసినవి కాకుండా రాగిపిండితో చేసిన దోశలు తినండి. అందులో కూరగాయలు కలిపి తినండి. రాగుల్లో ఐరన్, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది కడుపు నిండుగా ఉంచుతుంది. కేలరీలు తక్కువగా ఉంటాయి. దీని వల్ల బరువు ఈజీగా తగ్గుతారు.

కిచిడి

దీనికోసం మీరు పెసరపప్పు, శనగపప్పు దేంతోనైనా చేసుకుని తినొచ్చు. ఇందులో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఈజీగా జీర్ణమవుతుంది కూడా. పప్పులో చిరుధాన్యాలు యాడ్ చేసి తీసుకోవచ్చు.

శనగల సలాడ్

రాత్రి డిన్నర్లో శనగల సలాడ్ కూడా బెస్ట్ ఆప్షన్. శనగపప్పులో ప్రోటీన్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో కేలరీలు కూడా చాలా తక్కువగా ఉంటాయి. ఉడికించిన శనగల్లో సన్నగా తరిగిన ఉల్లిపాయ, టమాట, దోసకాయ, కొత్తిమీర తరుగు కలిపి సలాడ్ చేసుకుని తినొచ్చు.

ఓట్స్ ఇడ్లీ

మీరు ఈవెనింగ్ ఇడ్లీ తినాలనుకుంటే దానిని ఇంకా హెల్దీ అండి వెయిట్లాస్ ఫ్రెండ్లీగా తీసుకోవచ్చు. దీనికోసం ఓట్స్తో ఇడ్లీ తయారుచేసి తినొచ్చు. ఓట్స్లో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతోపాటు ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల మీరు త్వరగా బరువు తగ్గుతారు.

గమనిక: ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.